క్లుప్తంగా

వేడుకగా మహాకుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని నందవరం శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో మహా కుంభాభిషేక పూజల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కలశ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వస్తివాచనం, యాగ పూజలు, హోమ పూజలు, శ్రీచక్రార్చన, మహాలింగార్చన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, జపపారాయణం, యాగశాలబలి, పూర్ణాహుతి, మహామంగళహారతి వేదస్వస్తి, పుష్పాదివాసం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల లోని ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో మాఘమాసం సోమారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఏపీఎన్‌జీఓస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎన్‌జీఓలు

డోన్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు సోమవారం తన కార్యాలయంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ డైరీ ప్రభుత్వ ఉద్యోగులకు సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఇందులో విధులకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు. వెటర్నటీ వైద్యులు హరీష్, మహమ్మద్ రఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ భాను, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు షేక్షావలి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ విజేత ప్యాపిలి



విజేత జట్టుతో గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తాండ గ్రామంలో శ్రీసేవలాల్ మహారాజ్, మారెమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. ప్యాపిలి మండలం జట్టు ప్రథమ, సాంబవరం ద్వితీయ, బేతంచెర్ల తృతీయ, నాల్గో స్థానం బుగ్గానిపల్లె జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు వరుసగా రూ.12,116, రూ.6,116, రూ.3,116, రూ.2,116 చొప్పున బహుమతులను అందజేశారు.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



బేతంచెర్ల: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మండల పరిధిలోని గూటుపల్లె, హుసేనాపురం, తవిసికొండ, రహిమానుపురం, నాగమల్లకుంట గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా రూ.3 కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. గూటుపల్లె గ్రామ సమీపంలో సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించడంతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే గూటుపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరనుంది.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న నాగరాజు దంపతులు

కోవెలకుంట్ల: మండలంలోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి కోవెలకుంట్లకు చెందిన ఉపాధ్యాయుడు నాగరాజు, వరలక్ష్మి దంపతులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ పాలనతో పేదరిక నిర్మూలన

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



మీర్జాపురంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పేదరికాన్ని నిర్మూలించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండలంలో పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మీర్జాపురంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.50 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కొళాయి కనెక్షన్‌లను ప్రారంభించారు. రూ.5.10 కోట్లతో పెట్నికోట నుంచి అంకిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వరకు తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. గొర్విమానుపల్లెలో రూ.78 లక్షలతో అల్ట్రాటెక్ సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, పైపులైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొర్విమానుపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిష్కారం అయ్యాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి దుర్మార్గంగా వ్యవహరించి మైనింగ్ యజమానులను వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. పేదలకు భూపంపిణీ చేస్తుంటే ఓర్వలేక హైకోర్టుకు వెళ్లి అడ్డుకున్నాడని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు మరోసారి గుణపాఠం చెప్పాలని కోరారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, గొర్విమానుపల్లె సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్‌రెడ్డి, పార్టీ నాయకులు అంబటి గుర్విరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, జగన్ పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేసి టీడీపీ కండువా కప్పారు

మూడు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన రెడ్డి గొర్విమానుపల్లెలో ఓ కార్యక్రమం నిర్వహించారు. కొండమీదపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నె రామిరెడ్డి అక్కడున్న గాలిమరల వద్ద సెక్యూరిటీ గార్డుగా విధుల్లో ఉన్నాడు. కొందరు టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురి చేయడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని అతనికి మాయమాటలు చెప్పి బైక్‌పై గొర్విమానుపల్లెకు తీసుకెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక మాజీ ఎమ్మెల్యే బీసీతో టీడీపీ కండువా కప్పించి ఫొటోలు తీసుకున్నారు. ఇది ఇష్టం లేకపోవడంతో సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

బలిజ, కాపుల సంక్షేమానికి పెద్దపీట



బనగానపల్లెలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

బనగానపల్లె రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బలిజ, కాపుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఫోర్‌లైన్‌పై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ పాలనలో బలిజ, కాపు కులస్తులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కాపు కులస్తులకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. కాపు నేస్తం పథకంతో వారిని ఆర్థికంగా ఆదుకున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, మంచి పనులను ప్రజలు గుర్తు చేసుకుని మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. బలిజ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, నీలి శ్రీనివాసులు, కిశోర్, మనోహర్, రామన్న, కిట్టన్న, మహేష్, రామసుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఆకులరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్లతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రామాపురంలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో రూ.1.30 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీ జనార్దన్ రెడ్డి కళ్లకు గంతలు కట్టుకోవడం వల్ల మండలంలో జరిగిన అభివృద్ధి కనబడటం లేదని విమర్శించారు. రాష్ట్ర పరిధిలో లేని రామాపురం గ్రామం మీదుగా ఉన్న ఎన్‌హెచ్ 544డి రోడ్డును చూపించి విమర్శించి మాట్లాడటం సబబుకాదని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు నిధులు మంజూరు చేయించామని అన్నారు. గ్రామంలో 400 మీటర్ల పొడవుతో, 7 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని, త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్‌హెచ్ ఏఈఈ ఫణిరాం, ఎంపీటీసీ పేరం వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గిరి, రామారావు, ప్రమోద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీవర్ల కాలనీలో తాగునీటి సరఫరా పైప్‌లైన్‌కు ఒకే రోజులో మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కాలనీలోని ఓ వీధిలో పైప్‌లైన్ బ్లాక్ అయ్యి లీకేజీ కావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఇతరులకు కలుషిత నీరు సరఫరా అయ్యింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ నాగేంద్ర మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ రాజేష్, కౌన్సిలర్ నాగేంద్ర, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

16న సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్మిక సంఘం నేతలు

డోన్ టౌన్: డ్రైవర్ల మెడకు ఉరి తాడులాంటి హిట్ అండ్ రన్ చట్టం రద్దు కోరుతూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో ప్రతి రవాణా రంగం కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శివరాం కోరారు. సోమవారం డోన్‌లో సీఐటీయూ నాయకులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఇప్పటికే రవాణా రంగం ఆటుపోట్లను ఎదుర్కొంటుంటే ఇలాంటి చట్టాల కారణంగా మరింత దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు భాస్కర్, మద్దిలేటి, రామకృష్ణ, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కేసులు



బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తున్న ఎంవీఐ

బేతంచెర్ల: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారి వెంట వాహనాల తనిఖీ చేశారు. సామాన్య తనిఖీల్లో భాగంగా రోడ్ ట్యాక్స్, ఎఫ్‌సీ, పర్మిట్స్, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీకి రూ.46,400 జరిమానా విధించడమే కాకుండా, మద్యం సేవించి తమళనాడుకు చెందిన సిమెంట్ బల్గర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఆర్టీఓ తెలిపారు. మొత్తం 8 వాహనాలకు రూ.96,740 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

కరువు సహాయక చర్యలకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

బేతంచెర్ల: కరువు మండలంగా బేతంచెర్లను ప్రకటించారే తప్ప సహాయక చర్యలు చేపట్టలేదని.. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి నీటి కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా గూటుపల్లె చెరువును నింపాలని కోరారు. ఆయనతో రైతులు తిమ్మారెడ్డి, పద్మావతి, శివారెడ్డి, శేఖర్, రామకృష్ణ ఉన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో మంచినీటి పైపులైన్ లేక తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కృషితో రూ.5 లక్షల వ్యయం చేసి నూతన పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి వార్డు ప్రజలందరికీ తాగునీటి వసతి కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రతి వార్డులో సీసీరోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్ సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చార్లెస్ డార్విన్‌కు నివాళి



పాతపేట హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకుంటేనే ఆధునిక సమాజంలో రాణించగలరని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. జీవ పరిణామ సిద్ధాంత రూపకర్త చార్లెస్ డార్విన్ జయంతిని పురస్కరించుకుని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు డార్విన్ జీవిత చరిత్రను తెలియజేశారు. భూమిపై జీవరాశుల పరిణామం, కొత్త జీవాల రూపాంతరం తదితర డార్విన్ సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, వెంకటలక్ష్మి, రాధ పాల్గొన్నారు. అలాగే శ్రీసుధ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ యోగానందరెడ్డి, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో డార్విన్ చిత్రపటానికి నివాళులర్పించి జీవ పరిణామ సిద్ధాంతంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహిళకు ఆర్థిక సాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన పుల్లమ్మకు శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ నేతలు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పుల్లమ్మ ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకుని సోమవారం ఆర్థిక సాయం చేసినట్లు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్ తెలిపారు. సంఘం నాయకులు బాబయ్య, శివరామ్, నాగరాజు, రవి, తిమ్మరాజు, తిమ్మయ్య, చిన్నరాముడు పాల్గొన్నారు.

నేడు కైప గ్రామంలో సురక్ష శిబిరం

బనగానపల్లె: మండలంలోని కైప గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు సోమవారం తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తారని చెప్పారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సంజామల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ శ్మశాన వాటికను ఆక్రమించుకున్నారని ఫొటో తీయడానికి వెళుతున్న వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సంజామల ఎస్సీ కాలనీ శ్మశాన వాటికను గ్రామానికి చెందిన జయరాముడు, లక్ష్మయ్య ఆక్రమించుకున్నారని అదే గ్రామానికి చెందిన గంగ శివకుమార్ ఆ స్థలాన్ని ఫొటో తీయడానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జయరాముడు, లక్ష్మయ్య అతన్ని అడ్డుకున్నారు. శ్మశాన వాటిక తమదని దాడి చేశారు. స్థలం జోలికి వస్తే అంతు చూస్తామని బెదిరించారని బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


వ్యక్తి అనుమానాస్పద మృతి



మేడం మిల్లులో ఆంజనేయులు మృతదేహం

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు రోడ్డు సమీపంలో ఉన్న మేడం ఆయిల్ మిల్లులో మిరియాల అంజనేయులు (40) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు..తాడిపత్రి పట్టణానికి చెందిన ఆంజనేయులుకు చాగలమర్రిలోని చింతలచెరువు రస్తాలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మీతో 12ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి ఆయన అత్తగారి ఇంట్లోనే ఉంటూ హమాలీ పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. దినచర్యలో భాగంగా ఆదివారం ఉదయం హమాలీ పనికి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం మేడం మిల్లులో పడిపోయి ఉన్నాడని కొందరు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.మృతుడి తల్లి పద్మావతి భార్య ఆదిలక్ష్మీతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆంజనేయులు విగతజీవిగా పడిఉన్నాడు. ఆయన మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక హత్యకు గురయ్యాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసుకొని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

20 లీటర్ల సారా స్వాధీనం



సారా, బైక్‌తో పోలీస్ సిబ్బంది

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామ సమీపంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద అదే గ్రామానికి చెందిన తలారి అశోక్ కుమార్ సారాను అమ్ముతుండగా దాడి చేశామని, నిందితుడు పరారీ కావడంతో సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మెట్ట వద్ద సీఐ ప్రీతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్, ఏఎస్ఐ లింగమయ్య సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. గోరుమానుకొండ గ్రామానికి చెందిన చాకలి సాలన్న, ఓర్వకల్లు మండలం గుమ్మితం తాండకు చెందిన సురేష్ నాయక్ ద్విచక్రవాహనంపై 50 లీటర్ల సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని సారా, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ ప్రీతంరెడ్డి తెలిపారు.

మద్దిలేటి నరసింహస్వామి ఆలయ సంప్రోక్షణ



ఆలయంపై కలశాలను ఏర్పాటు చేస్తున్న అర్చకులు



మద్దిలేటి నరసింహస్వామి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఆలయ సంప్రోక్షణ కార్యక్రమం దీక్షాహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో సోమవారం ముగిసింది. ఆలయాన్ని నరసింహస్వామి భక్తులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పునర్‌నిర్మించి ఈ నెల 10వ తేది నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కలశప్రతిష్ట, ఆలయ సంప్రోక్షణ, దీక్షాహోమం, పూర్ణాహుతి పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బాబా ఆలయంలో వార్షికోత్సవ పూజలు



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: కర్నూలు రహదారిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు నిజపాద దర్శనం కల్పించారు. ఉదయం బాబాకు మందిర సంకీర్తన, కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, మహామంగళ హారతి నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు బాబాకి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కృపాధామ్ కమిటీ సభ్యులు బాబుల్ రెడ్డి, గుండా గోపాలు, వీరభద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి





ధర్నా చేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు, రోడ్డుపై ఆగిన టిప్పర్లు

కొలిమిగుండ్ల: స్థానికంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ కోసం టిప్పర్లు వెళుతుండడంతో సమీపంలోని పంటలపై దుమ్ము పడి దెబ్బతింటున్నాయని, తమకు నష్టపరిహారం చెల్లించాలని కొలిమిగుండ్ల, కల్వటాలకు చెందిన రైతులు పెద్దయ్య, రామ్మోహన్ కోరారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోవడంతో సోమవారం కల్వటాల సమీపంలో మైనింగ్ రవాణ చేస్తున్న రోడ్డుపై బైఠాయించారు. దీంతో టిప్పర్లు నిలిచిపోయాయి. వారు మాట్లాడుతూ.. చీని, అరటి పంటలు సాగు చేసుకుంటున్నామని.. పదుల సంఖ్యలో టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడం వల్ల పెద్ద ఎత్తున దుమ్ము పంటలపై పడి దిగుబడి పడిపోయిందని వాపోయారు. తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. కంపెనీ ప్రతినిధులు రైతులతో చర్చించినా వినకపోవడంతో టిప్పర్లను ఇతర మార్గం ద్వారా తీసుకెళ్లారు. రైతులు శరత్, పెద్దయ్య, రామ్మోహన్, నాగేష్, సీపీఐ నాయకులు సూర్యనారాయణ, రామకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని 2024-25 విద్యా సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం) చేరేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను వెబ్‌సైట్ http://ap.bragcet.apcfss.inలో ఈనెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులో తప్పులు ఉంటే గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళ్లి దరఖాస్తు నకలతో పాటు ఆధార్‌ను జత పరిచి తప్పును తొలగించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు.

ఐక్యతగా ఉంటే ఏదైనా సాధించగలం

అవుకు: ఐక్యతగా ఉంటే ఏదైనా సాధించగలమని అవుకు బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక బలిజ సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. పేద బలిజలను ఆదుకోవడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మండలంలో అనారోగ్యంగా ఉన్న, మృతి చెందిన బలిజ కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న ఈసీ మెంబర్లు, వార్డు మెంబర్లను సత్కరించారు. కార్యక్రమంలో అవుకు మండల, పట్టణ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు రామన్న, కంపిలి నారాయణ, క్రిష్ణమూర్తి, ప్రసాద్, నాయకులు రామాంజి, జక్కమధు, వేటూరి రమణ, క్రిష్ణ కుమార్, హరి పాల్గొన్నారు.